క్లుప్తంగా

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు



ఎస్‌ఐని సన్మానిస్తున్న నూతన ఎస్‌ఐ శ్రీశైలం, సిబ్బంది

కుల్కచర్ల: నిబద్ధతతో పనిచేసే ఉద్యోగి ఎక్కడికి వెళ్లి విధులు నిర్వహించినా.. గుర్తింపు, గౌరవం వాటంతట అవే వస్తాయని ఎస్‌ఐ గిరి అన్నారు. బుధవారం కుల్కచర్ల ఎస్‌ఐగా శ్రీశైలం బాధ్యతలు స్వీకరించడం, ఎస్‌ఐ గిరి బదిలీపై కోడూర్ మండలం చెన్‌గోముల వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గిరి మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి బదిలీలు తప్పని సరని, ముఖ్యంగా పోలీసుశాఖలో ఆ ప్రక్రియ సాధారణంగా జరుగుతుందన్నారు. ఉద్యోగులు అందరూ నిబద్ధతతో పనిచేసి గుర్తింపు, గౌరవాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్యసీలారెడ్డి, సిబ్బంది ఖాజ, శంకర్, రఘు, లక్ష్మణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారం కోసం కృషి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిగి: బహుజనుల రాజ్యాధికారం కోసం ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్‌పీ) కృషి చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ కాంక్ష, చైతన్యం లేని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగ విలువలు నేర్పిస్తూ పార్టీ ముందుకు నడుస్తుందన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని, వారికి ఎలాంటి సమస్యలు వచ్చినా ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగాన్ని చదవాలని సూచించారు. ఈ మేరకు రాజ్యాంగ పుస్తకాన్ని ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఉచితంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమహారాజ్, మల్లేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మనబడి' పనులు వేగిరం చేయాలి



మనబడి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కుల్కచర్ల: పాఠశాలల ప్రారంభ సమయానికి మనఊరు మనబడి పనులు పూర్తికావాలని ఎంపీడీఓ నాగవేణి అన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభించేందుకు 15రోజులు మాత్రమే సమయం ఉందని, సదరు కాంట్రాక్టర్లు పనులను వేగిరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, ఏపీఓ వెంకటేశ్, సర్పంచ్ శివిబాయి, పంచాయతీ కార్యదర్శి మైమూన బేగం, రాంరెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, టీఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా చేయాలి



ఎల్‌ఈడీ బల్బులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజిరెడ్డి

దోమ: విద్యుత్ ఆదా అయ్యే పరికరాలను ఉపయోగించాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలో ఇంధన శాఖ సహకారంతో సీక్వెస్ట్ క్యాపిటల్ ఎస్టీ ఇండియా, నిర్మల ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ బల్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు, ఆదా చేసేందుకు వినియోగదారులు కృషిచేయాలని చెప్పారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన రాజశేఖర్‌రెడ్డి

శంకర్‌పల్లి: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్ భాషాను శంకర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం డైరెక్టర్ కె.రాజశేఖర్ రెడ్డి బుధవారం ఏపీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎంతో బాగున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జంగయ్య ఉన్నారు.

రైతు రుణమాఫీ ఎప్పుడో?

- అన్నదాతకు తప్పని నిరీక్షణ
- మాఫీ కాదేమోనని రెన్యూవల్ చేసుకోని వైనం
- బకాయిదారులుగా ముద్రవేస్తున్న బ్యాంకులు

రుణమాఫీ సకాలంలో అమలుకాక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 2020లో రుణమాఫీ ప్రక్రియను రూపొందించినప్పటికీ అమలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. లక్ష రూపాయల లోపు పంట రుణాలను నాలుగు విడతల్లో నాలుగేళ్లలోగా మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినా.. ఆచరణలో అమలుకు నోచుకోలేదు. దీంతో రైతులకు కొత్త రుణాలు అందడం లేదు. ఎప్పటిలాగే సాగు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.



మొయినాబాద్‌లో సాగు చేసిన టమాటా పంట

మొయినాబాద్ రూరల్: పంట రుణమాఫీకి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అప్పులు రెన్యూవల్ చేసుకుంటే మాఫీ వర్తించదేమోననే భయంతో చాలా మంది రైతులు బ్యాంకుల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా బ్యాంకులకు రుణభారం అలాగే ఉండిపోగా రైతులను బకాయిదారులుగా గుర్తిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో పొలాల్లో నల్లమట్టిని పోయించడం, పశువుల పేడను తరలించడం చేయనున్నారు. కొందరు రైతులు సోయా, మొక్కజొన్న, వరి విత్తనాలను సేకరించే పనిలో ఉన్నారు. సాగు కోసం అవసరమైన పెట్టుబడులను రైతులు సమకూర్చుకోవాల్సి ఉంది. రుణమాఫీ ప్రకటించక ముందు పంటలపై వచ్చిన ఆదాయంతో రుణం చెల్లించేవారు. సీజన్ ఆరంభానికి ముందు మళ్లీ బ్యాంకుల నుంచి అప్పు పొందేవారు. 2018 ఎన్నికల సందర్భంగా మరోసారి అధికారంలోకి వస్తే రూ.లక్ష వరకు పంట రుణమాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో రైతులు బ్యాంకులకు రుణాలు కట్టడం లేదు. మాఫీ కాదేమోనని రెన్యూవల్ కూడా చేసుకోవడం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మాఫీ కాక రైతుల ఇబ్బందులు పడుతున్నారు. తొలుత రూ.25వేల లోపు, రెండో విడతలో రూ.50వేల లోపు రుణం బకాయి ఉన్నవారికే పంట రుణం మాఫీ అయింది. 2022-23 బడ్జెట్‌లో రూ.75వేల లోపు బకాయి ఉన్నవారికి పంట రుణం మాఫీ చేస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు వీరికి రుణ మాఫీ కాలేదు. రంగారెడ్డి జిల్లాలో 3.62 లక్షల మంది రైతులకు రూ.1,790 కోట్ల పంట రుణం మాఫీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటి వరకు రూ.25వేల లోపు బకాయి ఉన్న 18,211 మందికి, రూ.50వేల లోపు రుణం బకాయి ఉన్న 27,601 మందికి మాఫీ చేశారు. రూ.75వేల లోపు రుణం బకాయి ఉన్నవారు 25వేల మంది ఉంటారని అంచనా.. పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న తరుణంలో పెట్టుబడుల కోసం వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో పంట రుణం మాఫీని పూర్తిగా అమలు చేస్తే ఊరట లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లేకపోతే, ఎప్పటిలాగే సాగు పెట్టుబడి కోసం అధిక వడ్డీ చెల్లించి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

రైతుల అవస్థలను అర్థం చేసుకోవాలి



ప్రభుత్వం రైతుల అవస్థలను అర్థం చేసుకోవాలి. పెట్టుబడుల కోసం ఫైనాన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. రుణమాఫీ చేస్తే ఎంతో ఊరట లభిస్తుంది.

– మహేందర్ ముదిరాజ్, రైతు, బాకారం గ్రామం

మాట నిలబెట్టుకోవాలి



రుణమాఫీపై ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకోవాలి. 2018లో మరోసారి అధికారంలోకి వచ్చినా పంట రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది.

– దర్గా మహేందర్, పీఏసీఎస్ మండల వైస్ చైర్మన్

క్రీడలతో మానసికోల్లాసం

కొడంగల్ రూరల్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. అంగడిరాయిచూర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో గెలుపొందిన జట్లకు బుధవారం ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. పోటీలో 30జట్లు పాల్గొన్నాయని, ఇందులో మద్దూరు దగడ్ టీం విన్నర్‌గా, అంగడి రాయిచూర్ రైజింగ్ చాలెంజర్స్ టీం రన్నర్‌గా నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అంగడి రాయిచూర్ క్రికెట్ టోర్నీ నిర్వాహకులు, సర్పంచ్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులాన్ని విస్మరించడం తగదు

తాండూరు టౌన్: ఆర్థికంగా వెనుకబడిన వడ్డెర కులాన్ని విస్మరించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి తాండూరు ప్రతినిధులు శాంత్‌కుమార్, రాఘవేందర్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం కుల వృత్తులు చేసుకునే వారికి ఆర్థిక సాయాన్ని ప్రకటించిందని, అయితే వడ్డెర్లను మరిచిందన్నారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారని, వీరిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ప్రభుత్వానికి సిఫారసు చేయాలన్నారు.

రోడ్డు తవ్వకంపై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

పరిగి: మండల పరిధి నారాయణపూర్‌లో సర్వే నంబర్ 233, 234లో రియల్టర్లు వెంచర్ వేయడానికి మెటల్ రోడ్డును తవ్వేశారు. ఈ అంశంపై బుధవారం 'సాక్షి'లో 'రోడ్డును తవ్వేశారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ నారాయణరెడ్డి సీరియస్ అయ్యారు. తహసీల్దార్ రాంబాబు, పంచాయతీరాజ్ డీఈ సుదర్శన్‌రెడ్డిలను వెంటనే నివేదిక ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి తవ్విన మెటల్ రోడ్డును పరిశీలించారు. రియల్టర్లతో అధికారులు మాట్లాడి ఎలాంటి అనుమతులు ఉన్నాయని, ఏ విధమైన పనులు చేశారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.



తవ్విన రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్, పంచాయతీరాజ్ డీఈ తదితరులు

క్షయ నివారణకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాహత్

కొడంగల్ రూరల్: క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలని టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ రాహత్ అన్నారు. బుధవారం హస్నాబాద్ ఆరోగ్యకేంద్ర సబ్ సెంటర్‌లో నిర్వహించిన నిక్షయ దివస్‌లో క్షయ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ(టీబీ) లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే సరైన సమయంలో చికిత్స తీసుకోవాలని చెప్పారు. వ్యాధి సోకిన వ్యక్తులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ప్రతి నెల రూ.500 అందిస్తుందని, క్రమం తప్పకుండా మందులు వాడుతూ.. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వ్యాధి సోకిన వ్యక్తులతో పాటు కుటుంబసభ్యులు సైతం ముందు జాగ్రత్తగా మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, ఏఎన్‌ఎం రాములమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని కక్కులూర్‌లో జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి శుభోదయం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో సమస్యలు లేకుండా చేస్తామని చెప్పారు. సంబంధిత అధికారులు సైతం తనతో ఉంటారని ప్రజా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని చెప్పారు. తర్వలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ మమత, ఎంపీటీసీ కరుణాకర్, ఎంపీడీఓ అనురాధ, ఏఈలు శ్రీదివ్య, శారద, లక్ష్మన్‌నాయక్, ఏపీఓ వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు తదితరులున్నారు.



కక్కులూర్ మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య, అవినాష్‌రెడ్డి

రైతుబంధు మండల అధ్యక్షుడిగా అజీజ్



అబ్దుల్ అజీజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మోమిన్‌పేట: రైతుబంధు మోమిన్‌పేట మండల అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నియామకపత్రం అందజేశారు. అనంతరం అజీజ్‌ను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మర్పల్లి ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్, నాయకులు మైబలీ, లక్ష్మయ్య, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్ మండల సమితి అధ్యక్షుడిగా పాండురంగారెడ్డి

బషీరాబాద్: రైతుబంధు మండల సమితి అధ్యక్షుడిగా పర్వత్‌పల్లి గ్రామానికి చెందిన పాండురంగారెడ్డిని నియమిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మరో 24 మంది సభ్యులతో మండల కమిటీని ప్రకటించారు. వీరిలో రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఇందుభాయి, సావిత్రమ్మ, జాటోత్ సాలీబాయి, నరేష్, భాగ్యమ్మ, చంద్రశేఖర్, మోహన్‌రెడ్డి, అంతయ్య, కాశప్ప, బోయిని శేఖర్, విజయ్‌కుమార్, ముడావత్ సూర్య నాయక్, జెమ్యా, శ్రీనివాస్, సావిత్రమ్మ, వెంకటమ్మ, రుక్మారెడ్డి, కిష్టమ్మ, రజినీ దేవి, కొనగేరి మరియమ్మ, సీమా సుల్తానా ఉన్నారు.



పాండురంగారెడ్డి

నిరుపయోగంగా గృహ నిర్మాణ శాఖ భవనం

దౌల్తాబాద్: గృహనిర్మాణ శాఖ భవనం ఎలాంటి కార్యకలాపాలు లేకుండా నిరుపయోగంగా మారింది. ఏళ్ల కాలంగా అది వినియోగంలో లేక కళాహీనంగా తయారైంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున రూ.5లక్షలతో గృహనిర్మాణ శాఖ అధికారుల కోసం భవనాలను నిర్మించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన అనంతరం గృహనిర్మాణ శాఖను రద్దు చేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. భవనాన్ని ఏదైనా శాఖకు అప్పగిస్తే.. ఆ శాఖ విధులు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందని, అధికారులు ఆ విధంగా చర్యలు చేపడితే బాగుంటుందని పలువురి అభిప్రాయం వ్యక్తం చేశారు.

చెత్త రహిత పట్టణమే లక్ష్యం

అనంతగిరి: వికారాబాద్ పట్టణాన్ని చెత్త, ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్ పనులు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. బుధవారం పట్టణంలోని 5,10,11,27,34 వార్డుల్లో జరిగిన శానిటేషన్ పనులను ఆమె పర్యవేక్షించి మాట్లాడారు. చాలా కాలంగా ఒకే చోట ఉన్న చెత్తను గుర్తించి వెంటనే ఆ ప్రాంతాన్ని క్లీన్ చేయాలని, అవసరమైతే ఆ ప్రాంతంలో మొక్కలు నాటి మొత్తం గ్రీనరీతో నింపాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్‌ఐ



ఎస్పీని కలిసిన ఎస్‌ఐ

అనంతగిరి: కుల్కచర్ల నుంచి చన్‌గోముల పీఎస్‌కు బదిలీపై వచ్చిన ఎస్‌ఐ గిరి, వీఆర్ నుంచి కుల్కచర్ల పీఎస్‌కు బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ శ్రీశైలం ఎస్పీ కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు తమతమ పీఎస్‌లలో రిపోర్టు చేశారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న నేతలు

దోమ: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఊటుపల్లి సర్పంచ్ మామిళ్ల నర్సింహులు అన్నారు. బుధవారం ఊటుపల్లిలో కంటివెలుగును ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించిందని, కంటి సమస్యలు ఉన్నవారు నేత్ర శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

బొంరాస్‌పేట: బురాన్‌పూర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జెడ్పీటీసీ సభ్యురాలు అరుణదేశు చౌహాన్ తనిఖీ చేశారు. రోజువారీగా కేంద్రానికి చేరుతున్న ధాన్యం, గన్నీబ్యాగులు, ధాన్యం నిల్వ, రికార్డులు పరిశీలించారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట ఎంపీపీ హేమీబాయి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోండి



కుల్కచర్ల: ఉచితంగా బస్‌పాస్‌లు అందజేస్తున్న డిపో మేనేజర్ పవిత్ర

కుల్కచర్ల: వికలాంగులకు ఉచితంగా బస్‌పాస్‌లు ఇప్పించేందుకు దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని పరిగి డిపో మేనేజర్ పవిత్ర అన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో దాత అరవింద్.. గ్రామ పరిధిలో వికలాంగులకు ఉచితంగా బస్‌పాస్‌లు ఇప్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భద్రాచలం తలంబ్రాలను పొందేందుకు అత్యధిక భక్తులు పరిగి ఆర్టీసీ డిపో నుంచి బుక్ చేసుకోవడం , వాటిని అందజేయడంలో రాష్ట్ర స్థాయిలో డిపో రెండో స్థానంలో నిలిచిందని వెల్లడించారు. సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ చంద్రభూపాల్, ఆర్టీసీ సిబ్బంది చంద్రయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నిత్యం ఆరోగ్య పరీక్షలు

పరిగి: ఉద్యోగుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని వారికి చికిత్స అందించేందుకు ఆరోగ్య వలంటీర్లను సంస్థ నియమించిందని పరిగి ఆర్టీసీ డీఎం పవిత్ర తెలిపారు. బుధవారం డీపోలో ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహింపజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డిపోలోని ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణ కోసం ఆర్‌ఎం కార్యాలయం నుంచి ఇద్దరు పర్యవేక్షులను నియమించిందని, వారు నిరంతరం డిపో ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. వారికి అనారోగ్య సమస్యలు ఏమైనా ఉంటే.. వెంటనే తార్నాక ఆర్టీసీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించడం వారి పని అని పేర్కొన్నారు. కావున ఉద్యోగులందరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికడదాం

పెద్దేముల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ అనురాధ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం వలన జరిగే అనర్థాలను గ్రామీణులకు వివరించాలని చెప్పారు. వాటిపై జీపి అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయలు, ఆశ వర్కర్లు దృష్టి సారించాలన్నారు. చిన్న తనంలో పెళ్లి చేస్తే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండదన్నారు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే సమాచారాం ఇవ్వాలని, చెప్పిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఏపీఓ లక్ష్మీదేవి, ఏపీఓ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనురాధ

చిరుధాన్యాలతో మేలు

కొందుర్గు: ప్రతినిత్యం భోజనంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని, చిరుధాన్యాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి చెప్పారు. మిషన్ మేరీ లైఫ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. అలాగే, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని సూచించారు. మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రేవతి, ఏఎన్‌ఎం జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, సుగుణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ



విరాళం అందజేస్తున్న రాఘవేందర్

శంకర్‌పల్లి: అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేయడం అభినందనీయమని బీఆర్ఎస్ నాయకుడు, శంకర్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ సాత ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం అయ్యప్ప దేవాలయం నిర్మాణంలో భాగంగా మోకిలకు చెందిన దేవ్‌లానాయక్ రూ.11 లక్షలు, శంకర్‌పల్లి పట్టణ కేంద్రానికి చెందిన మాశెట్టి రాఘవేందర్ రూ.1లక్ష, 80వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప ఆలయం నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. గ్రామాల్లో అయ్యప్ప ప్రచారం రథం తిరుగుతోందని, ప్రతి ఒక్కరు తమ కుటుంబం నుంచి విరాళాలు, కానుకలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జంగయ్య, విష్ణువర్ధన్, సాత రాఘవేందర్, గౌతం పాల్గొన్నారు.